
# పగటి చంద్రుడు



‘పుట్టిన పుడమి మట్టిదనాన్ని... పురుడు పోసుకొని పెరిగి ఎగురుతూన్న పైరు పరిమళాన్నీ ఆస్వాదించనివాడు మాతృకలమార్దవం ముందు ఏనాటికైనా ఒదిగి పోవాల్సిందే!’

ఎవరో ఆశువుగా అన్నమాటలు నాకు జ్ఞాపకం వచ్చి, అప్పుడప్పుడూ ఆలోచింపజేస్తుంటాయి.

ఆ మాటల్లోని భావం పూర్తిగా అర్థం కాక పోయినా మాతృభూమి పట్ల ఏదోమూల గుండె ల్లో గూడుకట్టుకున్న మమకారం అప్పుడప్పుడూ నన్ను అలరిస్తూనే ఉంది.

అటువంటి చిత్రమైన అనుభూతిలో ఇప్పు డు నేనున్నాను. అదీ దాదాపు పదిహేను సం వత్సరాల సుదీర్ఘ విరామం తరువాత ఆమళ్ళ దిన్నె మరలా రావడం జరిగింది. అదీ పోశయ్య కూతురు పెళ్ళి పుణ్యమా అంటూ!

నాలో కల్గిన చిత్రమైన అనుభూతుల తుంప రలలో ప్రస్తుతం ఓలలాడుతున్నాను. మామూ లుగా అయితే ఆమళ్ళదిన్నె ఎప్పటిమాటో. పుట్టిన ఊరయినా నాన్న కాలం చేసిన తర్వాత ఉన్న కొద్దిపాటి పొలం పుట్రా వదిలించుకొని, ఉన్న ఇంటిని కూడా అమ్మిపడేసి హైదరాబాద్ లో సెటిల్ అయిపోయాను. ఆ ఊరితో తెగతెం పులు చేసుకున్న తర్వాత మరలా రావాల్సిన అవసరం కల్గలేదు. కానీ పోశయ్య పుణ్యమా అంటూ ఇన్నాళ్ళకి.

మనసులో ఆమళ్ళదిన్నె వెళ్ళి ఓమారు చూసిరావాలని ఉన్నా ఉద్యోగపు ఒత్తిళ్ళలోపడి రాలేకపోయాను. అదృష్టవశాత్తూ దసరా శల వులు కూడా కలిసి రావడంతో ఆనందంగా ఉంది నాకు.

వచ్చి కొద్దిసేపే అయినా బాల్యం తాలూకు మధురమైన జ్ఞాపకాలు చుట్టుముడుతున్నాయి. తేనెటీగల్లా పట్టుకలుముల్లోంచి బయటకు తన్ను కొచ్చి తీయగా కుట్టి తీపి తేనియను ఒలకబో సిన అనుభూతి నాలో చోటు చేసుకుంటోంది.

"అయ్యగారూ! టిఫిన్ తీసుకోండయ్యా!!" అచ్చుమ్మ పిలుపు నా ఆలోచనలకి అంతరా యాన్ని కలుగజేసింది. ఆమెకూడా పోశయ్య గాడిలాగానే కలివిడిగా పలకరిస్తుంది.

'"బాగున్నావా! పెళ్ళి హడావిడిలో నువ్వు తెచ్చి ఇవ్వాలా ఏంటి? మరొకళ్ళచేత పంపితే సరిపోయేది కదా!' అచ్చుమ్మ నవ్వింది.

"చిన్నయ్య పట్నం నుండి రావడం కన్నా ఎక్కువేం లేదిక్కడ"

పోశయ్యలాగే అచ్చుమ్మ కూడ సాత్వికు రాలు. నా చిన్నప్పుడు పోశయ్య మా ఇంట్లో పాలికాపరి. పశువుల పనులతోబాటు వ్యవసా యపు పనులలో కూడా నాన్నకు చేదోడు వాదోడుగా ఉండేవాడు. మట్టిని పిండిచేసి, కండల్ని కరిగించి పొలాన్ని పండించేవాడు.

ఒకసారయితే పెద్ద వర్షం. అప్పుడు మెట్ట పొలంలో ఊడ్పులు పూర్తయ్యాయి.

"నువ్వు దిగాలుపడకు పెద్దయ్యా! నేను చూస్తాగా!!" అంటూ తడుచుకుంటూ వెళ్ళి నారు మునిగిపోతూంటే గట్టు తెగ్గొట్టి వచ్చాడు. దాంతో మురుగునీరు కాస్తా కాలువలోకి పొర్లి పోయింది. లేకపోతే మరలా నాట్లు వేయాల్సి వచ్చేది.

ఉప్మా నోట్లో పెట్టుకున్నాను. అచ్చుమ్మ ఆదరణలాగానే మధురంగా ఉంది.

"తింటూ ఉండండి... ఆయనగారు కాఫీ తెచ్చిస్తాడు"

"పోశయ్యను పనులు చూసుకోమను. హడా విడి ఏమీ లేదు!"

"దాందేముంది అయ్యా! అల్లుడోళ్ళు ఇక్క డోళ్ళే. అన్నీ మా అన్నలు చూసుకుంటున్నారు. పట్నం నుండి తమరు రావడమే ఆనందం మాకు!"

"సరే! అల్లుడికేమిస్తున్నావేంటి" ఉప్మా ప్లేటు

**వడలి రాధాకృష్ణ**

ప్రక్కన పెట్టి అచ్చుమ్మ ఇచ్చిన సత్తుచెంబు నీటితో ముఖం కడుక్కుంటూ అడిగాను.

"మాలో పెద్ద కట్నాలు లేవయ్యా! కానీ ప్రేగు తెంచుకు పుట్టిన బొట్టి. అందులోనూ కడసారిది. ఈ ఇంట్లో ఆఖరి మనువాయే! అందుకే ఐదు సవర్ల బంగారం... ఏభై వేలు ముట్ట జెబుతున్నామయ్యా!"

చల్లని నీటిని ముఖం మీద చల్లుకోబోతున్న నేను లిప్తకాలం ఆగి ఆలోచనలో పడ్డాను.

ఐదు రూపాయిల అప్పుకోసం ఆనాడు నాన్నను ఎంతగానో ప్రాధేయపడి అడిగిన పోశయ్య... పూట పూటా తినడానికి ఏమీలేక అమ్మ ముందు నిలబడ్డ అచ్చుమ్మ... నా కళ్ళ ముందు మెదిలారు. ఆ స్థాయి నుండి ఎదిగి పదిమందిలో గౌరవప్రదంగా వైభవంగా కూతురుకు పెళ్ళి చేసి అత్తారింటికి పంపించే స్థితిలో పోశయ్య...

నాలో ఓ విధమైన అనాసక్తత... దాని వెంట ఓ ఉత్సాహం తాలూకు నిట్టూర్పు వెలువడ్డాయి.

ఏమైనా పోశయ్య కష్టజీవి. రెక్కలు ముక్కలు చేసుకుని... ఇంటిల్లిపాదీ పొలం పనులతో కాయకష్టం చేసుకొని ఆనందంగా ఈనాడు బ్రతుకును వెళ్ళదీస్తున్నాడు.

ఆనాడు నాన్నకు అత్యంత విధేయుడుగా, ప్రీతిపాత్రుడుగా మెలిగేవాడు. నిజం చెప్పాలంటే ఇంటి పాలేరుగా గాక ఇంటి మనిషిగా ఉండేవాడు.

నేను చదువులకని ఊర్లు పట్టిపోయినా అమ్మను, నాన్నను, చెల్లెల్ని ఆలనాపాలనా చూస్తూ ఉండేవాడు. అన్నీ పోశయ్య చూసుకుంటాడులే అన్న భరోసా ఉండేది నాన్నకు.

"చాల సంతోషం గంగయ్యా! బొట్టి పెళ్ళికి మానక వస్తావని కార్డు రాశాను. అభిమానంతో వచ్చావు. అమ్మగారు బాగుందా! నీ బొట్టి పెద్దదయి ఉంటది!!" పోశయ్య పిలుపు నాకు కొంత ఆనందాన్ని, ఆసక్తిని కల్గించింది.


"అవును నీ కూతురు పెళ్ళికి పిలిస్తే రాకుండా ఎలా ఉండగలను చెప్పు. అమ్మగారు కూడ వస్తానంది. కానీ అమ్మాయి పురిటికి వచ్చింది. వదిలి వచ్చే పరిస్థితి లేక ఒక్కణ్ణే రావాల్సి వచ్చింది."

"నీ రాక కడుపు నిండి పోతాంది. పెద్దయ్య పోయి ఏ లోకాన్నున్నాడోగానీ నిన్ను చూస్తే ఆయన వచ్చినంత సంబరంగా ఉందయ్యా." చెప్పుకుపోతున్నాడు పోశయ్య.

వయసు పెరిగింది... జుట్టు చాలావరకూ తెల్లబడిపోయింది. వాడి ముఖంమీద ముడతలు వార్ధక్యాన్ని చెప్పకనే చెబుతున్నాయి. ఎర్రటి మండుటెండలో కండల్ని కరిగించి కాయకష్టం చేసి, భూమిని దుక్కిదున్ని... నీరు పారించి... మొలకల్ని ఊడ్చి... ఈను ఎదిగి ఈనే వరకూ అన్నీ తానై... కోతలు కోసి... కుప్పలు నూర్చి... పెంకుటింటి దక్షిణాయ వసారాలోని గాదెను వడ్లతో నింపుతూన్న పోశయ్య నా కంటి ముందు కన్పిస్తున్నాడు.

తేరిపార చూశాను. ఏభైలు దాటి అరవైలకి దగ్గరవుతున్నాడు. నల్లగా నిగనిగలాడే కండలు కొద్దిగా వడలిపోతున్నట్లుంది. అంతా వయసు ప్రభావం.

బిస్కెట్ కలర్ పట్టు పంచె... పైజమా మీద ధోవతి. పోశయ్యకు ఓ విధమైన పెద్దరికాన్ని ఆపాదించి పెడుతోంది. అతని ముఖంలోని




ఆనందపు ఛాయలు నేను గమనించక పోలేదు. కూతురుకి వైభవంగా పెళ్ళిచేసి, అత్తారింటికి పంపుతున్నానన్న ఆనందం... కన్న తండ్రిగా తన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తున్నందుకు సంతోషం పోశయ్య మాటల్లో కన్పిస్తున్నాయి.

ఒక్కసారి చల్లని సమీర స్పర్శ ఏదోనన్ను ప్రశ్నిస్తున్నట్లనిపిస్తోంది. అవును ఆనాడు చెల్లెలు సుగుణ పెళ్ళిలో మా నాన్న అచ్చం అలాగే ఉన్నాడు.

"చాలా సంతోషం పోశయ్యా! పనుల్లో ఉన్నావు. పెళ్ళోళ్ళు వచ్చేటయమయింది. సాయంత్రం తీరిగ్గా కబుర్లాడుకుందాం!!"

"రాత్రంతా బస్సు ప్రయాణం చేసి వచ్చారు. కాసింతసేపు కునుకుతీయయ్యా! పెద్దోడు వచ్చి లేపుతాడు" ముందుకు కదిలాడు పోశయ్య.

కునుకు తీయమన్నాడేగానీ... కొత్త రోజులు... పాత జ్ఞాపకాలు... ఊరంతా తిరిగి చుట్టుముట్టి రావాలని... తెల్సినవాళ్ళని పలకరించి రావాలని ఉబలాటంగా ఉంది.

ఇంకా ముహూర్తానికి మూడు నాలుగు గంటలు టైము ఉంది. అందుకే వేగంగా పనులు ముగించుకొని బయటపడ్డాను.

"అరే! దాబా సుబ్బయ్య కొడుకు గంగాధరానివి కదూ!! పోల్చుకోలేకపోయాను సుమీ" ఓ ముసలాయన పలకరింపుతో అటు తిరిగాను.

"అవును చౌదరయ్యా" వెంటనే మనిషిని గుర్తు పట్టగల్గినందుకు చాలా ఆనందంగా అన్పించింది.

"మీ అమ్మ, నాన్న కాలం చేసిన తర్వాత ఇటువైపు రావడమే మానుకున్నావ్! ప్రస్తుతం..."

చెప్పాను.

'ఊరు మారిపోయిందయ్యా! పెద్దతలకా యలు ఒక్కొటీ రాలిపోతున్నాయి. పాత తరం పూర్తిగా పాతబడిపోతోంది!!' చెప్పుకుపోతు న్నాడు చౌదరయ్య.

నేను ఇక్కడ హైస్కూలులో చదివేటప్పుడు చౌదరయ్య నాకు సీనియరు. కాసేపు కాలక్షేపా నికి మాటలు కలిపాను. నా ఉద్యోగం గురించి, పిల్లల చదువుల గురించీ ఏకరువు పెట్టాను.

"బాగుందయ్యా! ఊరు విడిచి పట్నం వెళ్ళి బాగా బాగుపడ్డావు." అంటూన్న అతని ముఖం లో ఓ అసూయ తాలూకు కవళికను గమనిస్తూ నే ఉన్నాను.

"ఏమిటి మన ఊరు పరిస్థితి?"

"ఏముంది... కామందులు ఊరు దాటిపో యారు. వ్యాపారాలంటూ, ఉద్యోగాలంటూ వలసపోయారు. ఇక పాలేర్లు రాజ్యమేలుతు న్నారు."

చౌదరయ్య మాటల్లో ఓవిధమైన ఆవేశం కన్పిస్తోంది. మాట్లాడలేదు నేను.

"అవును గంగాధరం! నిన్నే తీసుకో. సుబ్బ య్య పెదనాన్న బ్రతికుండేటప్పుడు ఎలా ఉండే ది? ఊరును శాసించేవాడు. భూమిని దుక్కిదు న్నేవాడు, విత్తులు నాటి మట్టిలో మాణిక్యాలు పండించేవాడు. ఆయన శరీరం నుండి కురిసిన శ్వేద ఫలాన్ని చూసి పుడమితల్లి పులకించేది. తడి తగలగానే విచ్చుకున్న విత్తనం మొక్కైమొ లిచి... ఏపుగా ఎదిగి గుప్పెడు గింజలతో ఈని, సిరుల వరాలను కురిపించేది.

తాను తిని మరెందరికో పట్టెడన్నం పెట్టిన మీ నాన్న నిజంగా అజరామరుడు. ఆలకించిన వాణ్ణి అక్కున చేర్చుకుంటూనే ఉంటుంది ఈ భూమాత. నేలను నమ్ముకున్నవాణ్ణి ఆ తల్లి పైపైన నిలబెడుతుందేగానీ ఎప్పుడూ ముంచే యదు.


ఇప్పుడు పోశయ్యను చూడు... కష్టపడిన కర్షకుణ్ణి ఎప్పుడూ కనికరిస్తూనే ఉంటుంది. రెక్కల్ని ముక్కలు చేసుకుని ఇప్పుడు ఐదు ఎక రాల మాగాణికి కామందు అయ్యాడు. చెప్పుకు పోతున్నాడు చౌదరయ్య. నేను పోగొట్టుకున్న సాంస్కృతిక సంపద ఏమిటో కొంచెం కొంచెం గా అర్థమవుతోంది నాకు.

అయినా నాకేమి లోటు? మానాన్న గ్రామీ ణ వారసత్వం నేను పుచ్చుకోవాలని రూలెక్కడా లేదు. బాగా చదువుకున్నాను. బాగానే సంపాది స్తున్నాను. అందుకే ఆబళ్ళదిన్నెలో ఉండలేక హైదరాబాద్ చేరిపోయాను.

ఉన్న పొలం పుట్రను డబ్బుగా మార్చుకు న్నాను. అది కూడా మాకు ఇన్నాళ్ళు నమ్మిన బంటుగా ఉన్న పోశయ్యకే అమ్మేశాను. ఆ ఐదు ఎకరాల పొలం అమ్మగా వచ్చిన డబ్బు నేనేమీ పాడుచేయలేదు. చక్కగా బ్యాంక్‌లో డిపాజిట్ చేశాను. అప్పటినుండి ఇప్పటిదాకా అది పిల్ల ల్ని పెడుతూనే ఉంది.

చిన్నగా నవ్వు వచ్చింది. ఎవరి చాదస్తాలు వారివి. "అలా ఊరు చూసొస్తా చౌదరీ!" ముం దుకు కదిలాను. ఊరేమీ మారలేదు. అవే రోడ్లు, అవే ఇళ్ళు. కాకపోతే ఇక్కడా ప్రగతి ఉందన డానికి అక్కడక్కడా చిన్నపాటి డాబాలు అగు పిస్తున్నాయి.

నాలో ఇప్పుడు ఉరిమే ఉత్సాహం, పరుగు లెత్తే ఉల్లాసం అగుపిస్తున్నాయి కొత్తదయిన పాత చోటుని చూస్తున్నందుకు. బయటకు తెలియకుండా అదిమి పట్టుకున్నాను. చాలా




రోజుల తర్వాత గుర్తుకొస్తున్న చిన్ననాటి స్మృతులు అల్లరి చేస్తున్నాయి. ముందుకు కదిలాను.

ఎవరో పోశయ్య, చౌదరయ్యలాంటి ఒకరిద్దరు తప్ప నేనెరిగిన వారెవరుంటారు? ఇల్లు, పొలం అమ్ముకొని చదువుల వేటలో పట్నవాసాన్ని వెతుక్కుంటూ వెళ్ళిపోయాను.

ఇప్పుడు నేనెవరికి గుర్తు? అయినా నాలో ఒకింత మాసిపోని మమకారం. అది పోదుగా!

పొలాలు, సన్నటిపాయలు, పొలం గట్లపై బారులు తీరిన తెల్లని కొంగలు... దూరంగా తాటిచెట్లు. చిన్ననాటి ఊసుల దొంతరలు నన్ను పెద్దపెట్టున కదిలించసాగాయి.

చూస్తుండగానే నక్కల కాలవ... ప్రపంచంతో తనకు ఏవిధంగా సంబంధంలేనట్లు నిశ్చలంగా ఏరై పారుతోంది. అయితే ఈ మధ్య కాలంలో పెట్టిన ఫ్యాక్టరీ పుణ్యమా అంటూ నీరు అంతా మురికిగా ఉంది. అయినా రాజీపడి అందులోనే ఏపుగా పెరుగుతున్న తామర తూడులు. ప్రక్కన మల్లేశం బాబాయి మాగాణి పొలాలు.

చిన్ననాడు నింగి నేలల మధ్య నేస్తాలతో కేరింతలు కొట్టుకుంటూ కలతిరిగిన పొలాలు. పిచ్చుకలకు వేయాలని వడ్లకంకెలు కోస్తుంటే చాలాసార్లు మల్లేశం బాబాయి కర్ర తీసేవాడు.

ఒక్కసారి పొంగిపోయింది హృదయం. అంతలోనే నాలోని అంతర్వేదన. మొనాటనీకి అలవాటు పడిన వ్యక్తిత్వం నన్ను నివారిస్తూనే ఉంది.

బహుశా ఈ మధ్యకాలంలో అంత ఉద్వేగానికి, సంతోషానికీ గురైన సంఘటన మరేదీ లేదనే చెప్పాలి!

అక్కడ కలిసి, మమేకమై ఎదిగి, సహజీవనం చేసిన రావిచెట్టు, వేపచెట్ల సముదాయం కోసం వెతికాను.

'ఇలా రెండూ కలిసి ఎదిగితే ఊరికి శుభం. వాతావరణ రీత్యా కూడా మంచిది.' అని అమ్మ అంటుండేది. నేస్తాలతో మాకు సాయంత్రాలు విడిది అక్కడే. తీరాచూస్తే చెట్లు లేవు. బోడిగా ఉంది. ఉసూరుమంది నా మనసు.

ఊరంతా చుట్టి రావాలని మెరక వీధివైపు మరలాను. నేను చదివిన బడిలేదు అక్కడ. కూలిపోవడంతో ప్రక్క వీధిలోని పాకలోకి మార్చేశారట.

అయినా ఎన్నో ఏళ్ళ తర్వాత వచ్చి అప్పటి జ్ఞాపకాల్ని వెతుక్కోవడం అవివేకం అన్పిస్తోంది నాకు.

అయినా ఇన్నేళ్ళ కాలంలో పల్లెపల్లెనూ ఇంటర్నెట్‌లు, ఇ-సేవలు వచ్చి పలకరిస్తూంటే బూజుపట్టిన చిన్ననాటి చిహ్నాలను వెతుక్కోవడం ఒక విధంగా అసందర్భంగా అన్పించింది. మనసుకు సర్ది చెప్పుకున్నాను.

గరువు... గరువు మీద విఖనస స్వామి గుడి. కంచె గోడలు, గతుకుల రోడ్లు నన్ను పలకరిస్తూనే ఉన్నాయి. ఊరితాలూకు జ్ఞాపకాలు ఊపిరులూదుతూంటే ఒకనాటి మా స్వంత పొలానికి పోయి వీక్షించాలనిపించింది.

అనుకున్నదే తడవుగా కాలు నిలువలేదు. అప్పట్లో మా పొలం కొంత మెరకగా ఉండేది. గమ్మున వర్షం వచ్చినా నీరు నిలిచిపోకుండా ఉండడానికి నాన్న దానిని అలాగే ఉంచేశాడు. దానికి తోడు గట్టు మీద చింతచెట్టు. అప్పట్లో దాని నీడ పడినంత మేర భూమి మొలకెత్తేది కాదు.

నాన్న ఆ చింత చెట్టు నీడన నులకమంచం వేసుకొని కూర్చునేవాడు. ఆ నీడ కోసం దానిని అలాగే ఉంచేశాడు. అవన్నీ ఇప్పుడెలా ఉన్నాయో? పోశయ్యకు పొలం అమ్మేసిన తర్వాత ఇప్పుడెలా ఉందో?

అటుగా కదిలాను. నక్కల కాలువ ప్రక్కన ఉన్న ఆ ఐదు ఎకరాల సుక్షేత్రంలాంటి మాగాణి, పిల్లా పాపలతో కళకళ లాడుతున్న పోశయ్య కుటుంబంలా నిండుగా ఉంది. పచ్చని పైరు ఏపుగా పెరిగి ఉంది.

నక్కల కాలువలోని మురుగు నీరు కొంత ఇబ్బంది కల్గిస్తోంది. కానీ బోరు వేయించాడులా ఉంది నీటి కొరత ఏమీ ఉన్నట్లు లేదు.

దసరా రోజుల్లోనూ పడిన వరినాట్లు విచ్చుకొని ఎదిగి, ఈనిన బరువైన తలలతో ఊగుతూ నాకు వింజామరలు వీస్తున్నట్లుగా ఉంది. ఆ దృశ్యం నాలో ఎంతో ఆహ్లాదాన్ని కల్గిస్తోంది. అక్కడ ఆ చింతచెట్టు లేదు. మొత్తం భూమిలో వరి దట్టంగా పెరిగి ఉంది.

మెరక తీసేయడంతో ప్రక్క పొలాలతో సమానమై ఉరకలేస్తోంది. నేను కాదని కాలదన్ని పోయాను. పోశయ్య దానిమీద పూర్తిగా ఆధారపడ్డాడు. కుటుంబమంతా సేద్యాన్నే నమ్ముకొని... ప్రకృతికి విధేయతగా, దాని చెప్పుచేతల్లో మెలుగుతూ... ఎండకూ వానకూ ఎండి, తడిసి... తన చెమటల్ని నీరుగా పారించి పైరు పచ్చదనాన్ని కాపాడుతున్నాడు.

నేను పోగొట్టుకున్నది... వాడు రాబట్టుకున్నదేదో అవగతమవుతోంది నాకు. అపరాధ భావన నన్ను అతలాకుతలం చేస్తోంది.

నాకు నేను తద్భిన్నమై... చిన్ననాటి నుండీ చదువులంటూ, ఉద్యోగమంటూ పట్టణానికి ఎగబడ్డాను. బ్రతుకు మూలాలను కాలదన్ని, డబ్బున్నా జీవచ్ఛవమై...

మొత్తంమీద 900 రకాల గబ్బిలాలు ఉన్నాయంటే నమ్మతరమా?




సరిగా చెప్పాలంటే ఇప్పుడు నాకు పోశయ్య మీద విపరీతమైన అసూయ నెలకొని ఉంది. అయినా ఏదో కష్టపడి కూలి పనిచేసుకున్నాడు. ఇప్పుడు సుఖపడుతున్నాడు అని సర్దుకున్నాను.

వాచీ చూసుకున్నాను. పెళ్ళి ముహూర్తానికి ఇంకా అరగంట మాత్రమే ఉంది. ఆలోచనల్ని అక్కడే వదిలేసి, అటువైపు నడిచాను.

నిజం చెప్పాలంటే కూతురు పెళ్ళి రంగ రంగ వైభవంగా జరిపిస్తున్నాడు పోశయ్య. పందిరి అంతా బంధుమిత్రులతో నిండిపోయి ఉంది. కొత్త జంట ఈడూ జోడూ చక్కగా ఉంది. వాళ్ళని దీవించి నేను తెచ్చిన చిన్న బహుమతిని ఆ అమ్మాయి చేతిలో పెట్టాను.

"గంగాధరంగారని మా కామందు! పట్నం నుండి వచ్చారు" అల్లుడికి పరిచయం చేస్తున్నాడు పోశయ్య. తన ప్రక్కన నుంచున్నాడు. ఫొటోగ్రాఫర్ క్లిక్ మనిపించాడు.

మనసులో ఏదో వెలితిగాను, గిల్టీగానూ ఉంది నాకు. సుగుణ పెళ్ళి మా నాన్న ఇక్కడ అచ్చం ఇలాగే చేశాడు. చాలా ఏళ్ళ తర్వాత అప్పటిలాంటి సంతోషం కన్పిస్తోంది. పోశయ్య కళ్ళలోకి చూశాను. ఆ కళ్ళు చాలా సంతృప్తిగా మెరుస్తున్నాయి.

కష్టపడి కాయకష్టం చేసిన ఆ శరీరం నిగ నిగలాడుతూ మెరుస్తోంది.

"పోశయ్యా! పెళ్ళి చక్కగా జరిగింది. చాలా సంతోషం" భోజనం నుండి లేస్తూ అన్నాను.

"మీరు ఇంత అభిమానంగా రావడం మాకు సంతోషం"

"ఇక బయలుదేరతాను!"

"అదేటి చిన్నయ్యా! దసరా పండగనాడు వచ్చి గుడిలో శమీ పూజకు ఉండకుండాపోతారా చెప్పండి!!"

"అవునండీ! విఖనస స్వామివారి గుళ్ళో శమీ పూజ బాగా చేస్తారు. మీరు ఎలాగైనా సరే ఉండి తీరాల్సిందే!! రాత్రిదాకా డాబా ఇంట్లో ఓ కునుకు తీయండి!"

మొగుడూ పెళ్ళాం ఇద్దరూ అనేసరికి కాదనలేకపోయాను.

అక్కడ అంతా దసరా పండగ సందడి నెలకొని ఉంది. పోశయ్య ఇంటికి వచ్చిన పెళ్ళివారు చాలామంది వెళ్ళిపోయారు. అన్యమనస్కంగానే విఖనస స్వామివారి గుడివైపు నడిచాను. జమ్మిచెట్టు క్రింద కొమ్మను పాతి ప్రాణప్రతిష్ట చేస్తున్నాడు పంతులుగారు. నారాయణాచార్యులుగారు కాలం చేశారట. ఆయన కొడుకు గోపాలాచార్యులు. నేను పెద్దగా గుర్తుపట్టలేదు. ఆయనే వచ్చి పలకరించాడు.

బేసిరె నిండా బియ్యం నింపుకొని, పూజా సామాగ్రి దక్షిణలతో కావల్సినవన్నీ ఆచార్యులు గారికి అందజేసింది అచ్చమ్మ. గోపాలాచార్యులుగారు శమీపూజ మంత్రాలు వినసొంపుగా చదువుతున్నారు.

"పైడిపాల గోత్రస్య, గోవిందుల గంగాధరం నామధేయస్య, ధర్మపత్నీ సమేతస్య, సకుటుంబస్య క్షేమస్థైర్య విజయ అభయ ఆయురారోగ్య ఐశ్వర్యాభి వృద్ధ్యర్థం, అఖండ ధన కనక వస్తువాహనాది సిద్ధ్యర్థం..." శ్రావ్యంగా సంకల్పం చేయిస్తున్నాడు.

శమీపూజ సంకల్పంలో నాపేరు చదవడం నాకు అర్థం కావడం లేదు... వింతగా ఉంది నాకు. నన్ను లేచి జమ్మిచెట్టు ప్రదక్షిణలు చేయమంటున్నాడు. తాను ఊరికే కార్యక్రమం చూడ్డానికి వచ్చాడంతే! కానీ...

"అవును గంగాధరం! ఈ గుడి మీ వంశస్థులు కట్టించినది. తరతరాలుగా మీరు ఇక్కడ ఉన్నా లేకపోయినా మీ గోత్ర నామాలతో సంకల్పం చెప్పి, పూజ జరిపించడం ఆనవాయితీ! ప్రతిసారీ పోశయ్య అందుకు కావాల్సిన ఏర్పాట్లు అన్నీ చేస్తుంటాడు." చౌదరయ్య చెప్పుకుపోతున్నాడు.

ఒక్కసారి నాకు మైకం కమ్మినట్లు అన్పించసాగింది. ఆ మత్తులోనే శమీ వృక్షానికి ప్రదక్షిణలు చేస్తున్నాను. ఊరిలోని చాలామంది నా వెనకాల తిరుగుతున్నారు. కొందరైతే శమీమంత్రం వ్రాసిన కాగితాలని కొమ్మలకు గుచ్చుతున్నారు.

నా బుర్ర పనిచేయడం మానేసింది. ఈ ఊరితో పూర్తిగా తెగతెంపులు చేసుకొని ఇన్నాళ్ళుగా ఎక్కడికో ఎగిరిపోయాను. అక్కడ అన్నీ ఉన్నా ఏదో కోల్పోయినట్లు అన్పిస్తోంది. ఓవిధమైన, అమూల్యమైన మానసిక ఆనందాన్ని కోల్పోయి, నిర్జీవమైన బ్రతుకు ఈడుస్తూ...

కొంత అవివేకం, తెలియనితనాలతో...

నాలో నేను కుంచించుకుపోతూనే రాత్రంతా ఆలోచనలతో గడిపాను.

అవును! మట్టిబంగారాన్ని కాలదన్ని... ఓ భౌతికమైన జీవనధాతువును కోరి... కోరికలను కాలరాచి...


ఓ సాంస్కృతిక వైభవాన్ని...

పుట్టెడు సంతోషాన్నిచ్చే పుడమి ఒడిని...

మట్టి వాసనల్ని తెగనమ్మి...

కానిచోట అయినవాడుగా బ్రతుకుతూ...

నాకు చాల నిర్వేదనగా అన్పిస్తోంది. ఆ శమీపూజ నా ఆలోచనా ధోరణిని సమూలంగా మార్చివేస్తోంది. ఒక్కసారిగా లేనిదాని కోసం




వెతుకులాట ప్రారంభమయింది నాలో.

"గంగయ్యా! ఈ ఆమళ్ళదిన్నెకి అప్పుడప్పుడూ వచ్చి పోతుండవయ్యా... ఎంత కాదనుకున్నా పుట్టిన పల్లెటూరు!!" చెప్పుకుపోతున్నాడు పోశయ్య.

నాకు సిగ్గుగా ఉంది.

ఆనాడు తెగనమ్మి పారేసిన పొలం తాలూకు సొమ్ములు బ్యాంక్‌లో పిల్లల్ని పెడుతూనే ఉన్నాయి.

ఆ కాగితాలు నాకు ఏమీ పెద్దగా అనుభూతిని గాని, ఆనందాన్ని కానీ మిగల్చలేక పోతున్నాయి.

"హైదరాబాద్ చేరగానే ఫోన్ చెయ్యి!" వెంట నడుస్తూ అంటున్నాడు చౌదరయ్య.

వడివడిగా నడుస్తూన్న నా నడకలో వేగం మందగించడం గమనించాడులా ఉంది.

"ఏమయ్యింది!" అన్నాడు చౌదరయ్య.

"నిజంగా తప్పు చేశాను."

అర్థం కాలేదు వాడికి.

"అవును చౌదరీ! ఆనాడు పచ్చటి పొలాన్ని తెగనమ్మి తప్పు చేశాను!"

"పట్టణంలో కార్లలో తిరుగుతున్న వాడివి నీకు సెంటిమెంట్స్ ఏమిటి చెప్పు? అయినా ఈ మట్టి వాసనలు నీకెందుకు?"

'_______'

"బస్సు టైం అవుతోంది. వేగంగా అడుగులు వెయ్యి!"

"లేదు! ఈ ఊరిలో ఓ ఐదు ఎకరాల పొలం కొనాలని నిర్ణయించుకున్నాను. కనీసం వచ్చే దసరాల నాటికి రిజిస్ట్రేషన్ అయి తీరాలి!! అదంతా నీదే బాధ్యత!!!"

చౌదరికి నమ్మశక్యంగా లేదు. అయినా ఆ మాటల్లోని ఆర్తిని గ్రహించాడు. ●